# ఆదివారం టీ.వీ.

— కె.వి. రమణారావు

టీ.వీ. తీసుకున్నాక ఇంట్లో పరిస్థితే మారిపోయింది. విశ్రాంతే కరువైంది. నాకు తీరిక దొరికేది ఒక్క ఆదివారమే. ఆదివారం షాప్ బంద్ కాబట్టి ఇంట్లో ఆ రోజు రెస్ట్ తీసుకుంటాను.

ఇంట్లో సతీమణి, పిల్లల పోరు పడలేక టీ.వీ. కొన్నాను. అ దిప్పుడు నాకు తలనొప్పిగా తయారైంది. ఆదివారం ఎనిమిది గంటలకు మొదలయ్యే తెలుగు ప్రోగ్రామ్స్‌తో సహా తొమ్మిది గంటల నుంచి 'మహా భారత్, బధిరుల వార్తల' వరకు చూసి, మళ్ళీ సాయంత్రం అయిదుకే వచ్చి తిష్ఠ వేస్తారు దాదాపు ఓ పదిమంది మా ఆవిడ ఫ్రెండ్స్. అదే చుట్టుపక్కల ఆడవాళ్ళు. మా కుండేది నాలు గ్గదుల ఇల్లు కాబట్టి కష్టం. మధ్యాహ్నం తెలుగు సినిమా ఉంటే ... ఇక చెప్పాలా?

సెంటర్లో నా కో బట్టల షాపుంది. షాపు తెరిచినన్ని రోజులూ బిజినెస్ వ్యవహారాలతో మానసికంగా చాలా అలసిపోతాను. అందుకే ఆదివారం నాడు విశ్రాంతి తీసుకుంటాను. మా వీధిలో టీ.వీ. ఎవరికీ లేనందున అందరూ ఇక్కడి వస్తారు. వద్దని చెప్పలేం కదా!

ఈ విషయంలో నా కో ఉపాయం చెప్పాడు నా స్నేహితుడు ఓ రోజు. బ్రహ్మాండమైన ఆలోచన అది. తెల్లవారి నుంచే దాన్ని ఆచరించాలని నిశ్చయించుకున్నాను.

ఆ రోజు శనివారం షాపు మూసేసి వచ్చేప్పుడు పదిహేను మంచి చీరల దాకా తీసుకొచ్చాను. మా ఆవిడను పిలిచి విషయం చెప్పాను. ఆ ఉపాయం సంగతీ చెప్పాను.

తెల్లవారి టీ.వీ. చూడడానికి అందరూ రాగానే టీ.వీ. ఆన్ చేసి, నేను తెచ్చిన చీరలు అందరికీ చూపెట్టింది సతీమణి. ఎవరికి నచ్చిన చీరలు వాళ్ళు తీసుకున్నారు. మళ్ళీ వచ్చే ఆదివారం వరకు నా డబ్బులు నాకు వచ్చేశాయి.

ఈ సారి ఇంకాస్త మంచి డిజైన్ చీరలు తెచ్చాను. ఆ రోజు అందరూ చీరలు తీసుకెళ్ళి మళ్ళీ వెనక్కి తెచ్చిచ్చేశారు. లేకపోతే వాళ్ళ పతులు ఊరుకుంటారా? తరువాత ఆదివారం నుంచి చాలామంది టీ.వీ.కి రావడం మానేశారు. కొందరు వచ్చే వాళ్ళతో అప్పుడప్పుడు నా చీరల వ్యాపారం బాగానే సాగుతూంది. పైగా ఇద్దరు ముగ్గురితో పెద్దగా ముచ్చట్ల గొడవ ఉండదు. ఇప్పుడు ఏ గొడవా లేకుండా హాయిగా ఉంది. ముఖ్యంగా ఆదివారం.

ఆ ఉపాయం చెప్పిన నా స్నేహితునికి మంచి డ్రెస్ ప్రెజెంట్ చేశాను. ★

